సాక్షి
శ్రీసత్యసాయి జిల్లా
ఆదివారం । 23 । ఫిబ్రవరి । 2025



టన్ను చీనీ రూ.20,700
అనంతపురం మార్కెట్‌యార్డులో శనివారం టన్ను చీనీకాయలు గరిష్టంగా రూ.20,700, కనిష్టంగా రూ.3,100 ప్రకారం క్రయవిక్రయాలు జరిగాయి.



కిలో టమాట రూ.10
అనంతపురం శివారు కక్కలపల్లి మండీలో శనివారం కిలో టమాట గరిష్టంగా రూ.10 కనిష్టంగా రూ.7 ప్రకారం ధర పలికింది. మార్కెట్‌కు 525 టన్నుల టమాట అమ్మకానికి వచ్చింది.

గరిష్టం/కనిష్టం
37.2°/14.9°
జిల్లాలో శనివారం పగటి, రాత్రి ఉష్ణోగ్రతలు పెరిగాయి. చలితీవ్రత తగ్గిపోగా, భానుడి భగభగలకు మధ్యాహ్నం ఉక్కపోత పెరిగింది. గంటకు 6 నుంచి 10 కి.మీ వేగంతో ఈశాన్యం దిశగా గాలి వీచింది.

న్యూస్‌రీల్

జూన్ 10లోపు 'హంద్రీ-నీవా లైనింగ్' పూర్తి కావాలి
- కలెక్టర్ టీఎస్ చేతన్



హంద్రీ-నీవా కాలువ లైనింగ్ పనుల మ్యాప్‌లను పరిశీలిస్తున్న కలెక్టర్ టీఎస్ చేతన్

ప్రశాంతి నిలయం: హంద్రీ-నీవా కాలువకు సిమెంట్ లైనింగ్ వేసే పనులు వేగవంతం చేసి జూన్ 10వ తేదీలోపు పూర్తి చేయాలని కలెక్టర్ టీఎస్ చేతన్ సంబంధిత శాఖ ఇంజినీర్లను ఆదేశించారు. శనివారం ఆయన కలెక్టరేట్‌లోని కోర్టు హాలులో హంద్రీ-నీవా సుజల స్రవంతి పథకం ఇంజినీర్లతో సమావేశమయ్యారు. జిల్లా పరిధిలో ప్రధాన కాలువ లైనింగ్ పనులకు సంబంధించిన మ్యాపులను పరిశీలించారు అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ...హంద్రీ-నీవా ద్వారా చివరి ఆయకట్టు వరకూ నీరందించాలన్నదే ప్రభుత్వ లక్ష్యమన్నారు. ఈ క్రమంలోనే ఫేజ్-2 పనుల్లో భాగంగా 260 కిలోమీటరు నుంచి 404 కిలోమీటరు వరకు కాలువకు లైనింగ్ పనులు చేపడుతున్నామన్నారు. కార్యక్రమంలో హెచ్ఎన్ఎస్ఎస్ ఎస్ఈ రాజస్వరూప్ కుమార్, ఈఈ వెంకటేష్ శెట్టి, మురళి తదితరులు పాల్గొన్నారు.

పోలీసుల సంక్షేమానికి ప్రాధాన్యం
- 'డయల్ యువర్ డీపీఓ'లో ఎస్పీ రత్న



సిబ్బంది సమస్యలు వింటున్న ఎస్పీ రత్న

పుట్టపర్తి టౌన్: శాంతిభద్రతల పరిరక్షణలో అహరహం శ్రమించే పోలీసుల సంక్షేమానికి అధిక ప్రాధాన్యం ఇస్తున్నామని ఎస్పీ రత్న తెలిపారు. ఈ క్రమంలోనే పోలీస్ సిబ్బంది సమస్యల పరిష్కారం కోసం ప్రతి నాలుగో శనివారం 'డయల్ యువర్ డీపీఓ' కార్యక్రమం ప్రవేశపెట్టినట్లు ఆమె వెల్లడించారు. శనివారం పోలీస్ కార్యాలయంలోని వీడియో కాన్ఫరెన్స్ హాలులో 'డయల్ యువర్ డీపీఓ' నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. డయల్ యువర్ డీపీఓలో పోలీస్ సిబ్బంది తమ జీత భత్యాలు, సరెండర్, మెడికల్ లీవ్‌లు, హెచ్ఆర్ఏలు, ఇంక్రిమెంట్లు తదితర సమస్యలు తెలుపుకోవచ్చన్నారు. స్థానికంగా అందుబాటులో లేని వారు వాట్సాప్ ద్వారా సమస్యను వివరిస్తూ మెసేజ్ పంపవచ్చన్నారు. సమస్యలకు 15 రోజుల్లోపు పరిష్కారం చూపుతామన్నారు. కార్యక్రమంలో డీపీఓ ఏఓ సుజాత, సూపరింటెండెంట్లు సరస్వతి, మల్లికార్జున, సూర్యతేజ తదితరులు పాల్గొన్నారు.



భారీగా ఇంధనం!

- పెరిగిన పెట్రోలు, డీజిల్ వినియోగం
- నెలకు ఒక్క పెట్రోలు ఖర్చే రూ.129.23 కోట్లు
- ఇప్పటికీ పుంజుకోని ఎలక్ట్రిక్ వాహనాల అమ్మకాలు

సాక్షి ప్రతినిధి, అనంతపురం: ఉమ్మడి అనంతపురం జిల్లాలో పెట్రోలు, డీజిల్ వినియోగం ఏటికేటికీ భారీగా పెరుగుతున్నట్లు తెలుస్తోంది. దశాబ్ద కాలంలో అనంతపురం, శ్రీ సత్యసాయి జిల్లాల్లో వాహనాల సంఖ్య అమాంతం పెరిగింది. గడిచిన నాలుగైదేళ్లలో ఆటోలు, కార్ల అమ్మకాలు భారీగా పెరిగాయి. దీంతో పెట్రోలు, డీజిల్ వినియోగం గరిష్ఠ స్థాయికి చేరుకుంది. వచ్చే వేసవిలో మరింతగా ఎగబాకే అవకాశం కనిపిస్తోంది.

రోజుకు రూ.4.30 కోట్లు..
ఉమ్మడి అనంతపురం జిల్లాలో రోజుకు పెట్రోలు వ్యయం రూ.4,30,78,992 అవుతున్నట్లు తాజా గణాంకాలను బట్టి తెలుస్తోంది. ఇందులో కార్లు, ఆటోల వినియోగం ఎక్కువగా ఉంది. 40 శాతం పెట్రోలు వ్యయం ద్విచక్రవాహనాలకు అవుతున్నట్టు తెలుస్తోంది. ప్రతి ఏటా ద్విచక్రవాహనాల సంఖ్య 6 శాతం పెరుగుతోంది. ఈ క్రమంలో కాలుష్యం పతాక స్థాయికి చేరుతోంది. కాలం చెల్లిన వాహనాలను వాడుతుండటంతో పెట్రోలు వినియోగం అధికమై కాలుష్యం రెండింతలు పెరుగుతున్నట్టు నిపుణులు చెబుతున్నారు.

ఎలక్ట్రికల్ వాహనాలు పుంజుకుంటేనే..
ఉమ్మడి అనంతపురం జిల్లాలో ఎలక్ట్రిక్ వాహనాల అమ్మకాలు పుంజుకుంటే తప్ప పెట్రోలు వినియోగం తగ్గే అవకాశం లేదు. గతంలో ఎలక్ట్రిక్ వాహనం కొనుగోలు చేస్తే పన్ను మినహాయింపు ఉండేది. ఇప్పుడా మినహాయింపును ఎత్తేయడంతో చాలామంది మొగ్గు చూపడం లేదు. ఇప్పుడిప్పుడే కార్లు కూడా ఎలక్ట్రిక్ వాహనాల మార్కెట్‌లోకి వచ్చాయి. వీటికి పవర్ స్టేషన్‌లు తక్కువగా ఉన్నాయని వినియోగదారులు అంటున్నారు. ప్రధానంగా కార్లు, ద్విచక్రవాహనాలు ఎలక్ట్రిక్ మోడ్‌లో వస్తే పెట్రోలు వినియోగం భారీగా తగ్గే అవకాశం ఉంటుందని నిపుణులు చెబుతున్నారు. పెట్రోలు రేట్లు భారీగా పెరుగుతున్నా ప్రత్యామ్నాయం లేకపోవడంతో వినియోగదారులు భరించాల్సి వస్తోంది.

జిల్లాలో కంపెనీల వారీగా నెలకు పెట్రోలు వినియోగం (లీటర్లలో)	
ఐఓసీఎల్	17,17,000
బీపీసీఎల్	9,60,000
హెచ్‌పీసీఎల్	13,96,000
మొత్తం	40,73,000
విలువ	రూ.44,62,37,880
డీజిల్ వినియోగం (లీటర్లలో)	
ఐఓసీఎల్	20,14,000
బీపీసీఎల్	11,84,000
హెచ్‌పీసీఎల్	13,97,000
మొత్తం	45,95,000



వైఎస్సార్ సీపీ కార్యకర్తపై రాళ్ల దాడి



దాడిలో గాయపడిన వైఎస్సార్ సీపీ కార్యకర్త సుబ్రహ్మణ్యం

చెన్నేకొత్తపల్లి: ఒంటరిగా వెళ్తున్న వైఎస్సార్ సీపీ కార్యకర్తపై టీడీపీ కార్యకర్త రాళ్లదాడి చేసి తీవ్రంగా గాయపరిచాడు. బాధితుడు తెలిపిన వివరాల మేరకు..మండల పరిధిలోని నాగసముద్రం గ్రామానికి చెందిన సుబ్రహ్మణ్యం గత ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొన్నాడు. దీంతో టీడీపీకి చెందిన సుబ్బరాయుడు అతనిపై కక్ష గట్టాడు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి సమయం కోసం వేచి చూస్తూ వచ్చాడు. ఈ క్రమంలోనే శనివారం సాయంత్రం సుబ్రహ్మణ్యం వ్యక్తిగత పని నిమిత్తం నాగసముద్రం నుంచి ఎన్ఎస్ గేట్‌కు వెళ్తుండగా... చెరువు కట్ట కింద టీడీపీ కార్యకర్త సుబ్బరాయుడు అడ్డుకున్నాడు. అనంతరం సుబ్రహ్మణ్యంపై రాళ్లతో దాడి చేశాడు. ఈ ఘటనలో గాయపడిన సుబ్రహ్మణ్యం చెన్నేకొత్తపల్లి ప్రభుత్వ ఆస్పత్రికి వెళ్లి చికిత్స చేయించుకున్నాడు. పెదవికి పెద్ద గాయం కావడంతో వైద్యులు కుట్లు వేశారు. అనంతరం పోలీసు స్టేషన్‌కు వెళ్లి తనపై జరిగిన దాడి గురించి ఫిర్యాదు చేశారు.



సంగీత కచేరీ నిర్వహిస్తున్న రక్షిత రాంజీ బృందం

సద్బుద్ధి ప్రసాదించు సాయీ

ప్రశాంతి నిలయం: అందరినీ ప్రేమించు..అందరినీ సేవించు అంటూ విశ్వశాంతిని కాంక్షించిన సత్యసాయి నామామృతంతో ప్రశాంతి నిలయం మార్మోగింది. ఆధునిక నాగరికత పేరిట అదుపుతప్పిన మానవులకు సద్బుద్ధి ప్రసాదించు సాయీ అంటూ భక్తులు వేడుకున్నారు. సత్యసాయి సెంట్రల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో సాయికుల్వంత్ సభా మందిరంలో అతిరుద్రం మహాయజ్ఞం తొమ్మిదో రోజు శనివారమూ కొనసాగింది. మహాయజ్ఞంలో పాల్గొన్న భక్తులు వేదమంత్రాలు..సత్యసాయి కీర్తనలతో ఆధ్యాత్మిక పరవశం చెందారు. సాయంత్రం సత్యసాయి సన్నిధిలో కుమారి రక్షిత రాంజి బృందం సంగీత కచేరీ నిర్వహించింది. సత్యసాయిని కీర్తిస్తూ నిర్వహించిన కచేరీతో సాయికుల్వంత్ సభా మందిరం మార్మోగింది. అనంతరం భక్తులు సత్యసాయి మహాసమాధిని దర్శించుకున్నారు.



అతిరుద్ర మహాయజ్ఞం నిర్వహిస్తున్న వేదపండితులు



ప్రత్యేక అలంకరణలో సాయీశ్వర లింగం

లైనింగ్‌తో రైతులకు తీరని అన్యాయం

- సర్కారుపై పార్టీలకతీతంగా తిరుగుబాటు
- ఎమ్మెల్యే పరిటాల సునీత నోరుమెదపకపోవడం అన్యాయం
- మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి



సింగంపల్లి గ్రామంలో రచ్చకట్టపై రైతులతో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి

ఆత్మకూరు: 'హంద్రీ-నీవాలో లైనింగ్ చేస్తే జిల్లా రైతులకు తీవ్ర నష్టం జరుగుతుంది. ఈ రోజు మనం మౌనంగా ఉంటే.. భవిష్యత్తులో మన పిల్లలకు తీరని అన్యాయం చేసిన వారవుతాం' అని మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి పేర్కొన్నారు. శనివారం ఆత్మకూరు మండలంలోని సింగంపల్లి, వై.కొత్తపల్లి, పంపనూరు, తలుపూరు గ్రామాల్లో రచ్చకట్టల వద్ద సమావేశాలు నిర్వహించారు. ఈ సందర్భంగా తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి మాట్లాడుతూ హంద్రీ-నీవా కాలువలో ప్లాస్టింగ్ చేస్తే చుక్క నీరు కూడా భూమి లోపలికి ఇంకదనే విషయం సీఎం చంద్రబాబుకు తెలియదా అని ప్రశ్నించారు. రాప్తాడు నియోజకవర్గంలో హంద్రీ-నీవా కాలువ దాదాపు వంద కిలోమీటర్ల మేర పారుతోందని, లైనింగ్ పనులతో 1.50 లక్షల ఎకరాల ఆయకట్టు రైతులు దెబ్బతింటారన్నారు. కుప్పానికి నీరు తీసుకెళ్లాలన్న తొందరలో లైనింగ్‌కు తెరలేపా రన్నారు. ఇప్పటికీ శ్రీశైలంలో 80 టీఎంసీల నీరు ఉన్నాయని, మరో ఐదు నెలలు హంద్రీ-నీవా కాలువలో నీరు పారించే అవకాశమున్నా, నీటిని ఆపి మరీ పనులు చేయాలనుకోవడం దౌర్భాగ్యమన్నారు. జీడిపల్లి వరకు హంద్రీ- నీవా కాలువను మొదటి దశలో వెడల్పు చేస్తున్నారని, అక్కడి దాకా వెడల్పు చేస్తూ మనకు వచ్చే సరికి మాత్రం ఎందుకు లైనింగ్ చేస్తున్నారని ప్రశ్నించారు. ఓ టీడీపీ నాయకుడే ఇటీవల ప్రభుత్వ తీరుపై వీడియో ద్వారా ఆవేదన వ్యక్తం చేశాడని, దీన్ని బట్టి పరిస్థితి ఎంత ఘోరంగా ఉండబోతోందో అర్థం చేసుకోవచ్చన్నారు. ముందు పేరూరు డ్యాంకు నీరు వదలాలని డిమాండ్ చేశారు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో అప్పటి సీఎం జగనన్న కుప్పానికి నీటిని తరలించేందుకు అన్నమయ్య జిల్లా రాయచోటి నుంచి లిఫ్ట్ ఇరిగేషన్ స్కీమ్‌కు శ్రీకారం చుట్టిన విషయాన్ని గుర్తు చేశారు. అప్పట్లోనే చిత్తూరు జిల్లాలోని హంద్రీ-నీవా కాలువకు లింక్ కాలువ ఏర్పాటు చేశారని, రూ.3 వేల కోట్ల పనుల్లో దాదాపు రూ.1,500 కోట్ల పనులు పూర్తయినట్లు వెల్లడించారు. ఆ పనులు చేపట్టకుండా లైనింగ్ చేస్తామనడం అన్యాయమన్నారు. దీనిపై స్థానిక ఎమ్మెల్యే పరిటాల సునీత నోరు మెదపకపోవడం దుర్మార్గమన్నారు.

వైఎస్సార్ చలువతోనే నీరు..
హంద్రీ-నీవా కాలువ దివంగత నేత డాక్టర్ వైఎస్ రాజశేఖర్ రెడ్డి పుణ్యమేనని, ఆయన చలువతో రైతులు తమ పొలాల్లో బోర్లు వేయించుకొని, పంటలు పండించుకుంటున్నారని ప్రకాష్ రెడ్డి తెలిపారు. మహానేత ఆశయాన్ని నీరు గార్చేలా వ్యవహరిస్తున్న కూటమి ప్రభుత్వంపై పార్టీలకతీతంగా నేడు ఉద్యమిస్తున్నారన్నారు. రైతులను కాదని లైనింగ్ పనులు చేస్తే అందరం కలసి అడ్డుకుంటామని, అందులో తాను ముందుంటానని హెచ్చరించారు. తన పాదయాత్రకు పోలీసులు అనుమతి ఇవ్వకపోవడంతో హైకోర్టుకు వెళ్లామని, త్వరలోనే యాత్ర చేపట్టనున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో ఎంపీపీలు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, రైతులు పాల్గొన్నారు.

అడిగినంత ఇస్తేనే రిజిస్ట్రేషన్

- సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో 'ప్రైవేటు' సైన్యం
- డాక్యుమెంట్ రైటర్లతో అధికారుల కుమ్మక్కు
- క్రయవిక్రయ దారుల నుంచి ఇష్టానుసారం వసూళ్లు
- ప్రశ్నిస్తే రిజిస్ట్రేషన్ చేయకుండా కొర్రీలు

హిందూపురం సబ్ రిజిస్ట్రేషన్ కార్యాలయంపై ఏటా ఏసీబీ (అవినీతి నిరోధకశాఖ) దాడులు జరుగుతాయి. ప్రజల నుంచి వసూళ్లు చేసే ప్రైవేటు వ్యక్తులతో పాటు అధికారులూ పట్టుబడతారు. ఆ తర్వాత పైరవీలు చేసుకుని మళ్లీ కార్యాలయంలో కొలువుదీరతారు. ఇలా.. మూడేళ్ల కాలంలో రెండుసార్లు ప్రైవేట్ వ్యక్తులు, అధికారులు పట్టుబడినా.. మళ్లీ ఇక్కడ షరా మామూలే అన్నట్లు వసూళ్ల రాజ్యం నడుస్తోంది.

చిలమత్తూరు సబ్ రిజిస్ట్రార్ వెంకటరమణ, మరో ఉద్యోగి తప్పుడు రిజిస్ట్రేషన్లు చేయడం, అవి వెలుగులోకి రావడంతో ఉన్నతాధికారులు నెల క్రితం వారిని సస్పెండ్ చేశారు. తప్పుడు రిజిస్ట్రేషన్ తతంగం వెనుక డాక్యుమెంట్ రైటర్లు ఉన్నట్లు తేలింది. తాజాగా కొత్తగా వచ్చిన అధికారులను డాక్యుమెంట్ రైటర్లు మచ్చిక చేసుకుని దందా సాగిస్తున్నట్లు తెలుస్తోంది.

గత ఏడాది బుక్కపట్నం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో ఏసీబీ అధికారులు దాడులు చేయగా సబ్ రిజిస్ట్రార్‌తో సహా సిబ్బంది అవినీతి వెలుగు చూసింది. సబ్ రిజిస్ట్రార్ శ్రీనివాసనాయక్ ఏసీబీ అధికారుల నుంచి తప్పించుకుని పరారై ఆత్మహత్య చేసుకోవడం అప్పట్లో రాష్ట్ర వ్యాప్తంగా చర్చనీయాంశమైంది. ఈ ఘటనలో డాక్యుమెంట్ రైటర్ శ్రీహరిని పోలీసులు అదుపులోకి తీసుకున్న విషయం తెలిసిందే.

హిందూపురం అర్బన్: జిల్లాలో తొమ్మిది సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలుండగా... ప్రతి కార్యాలయంలోనూ పదుల సంఖ్యలో డాక్యుమెంట్ రైటర్లు కనిస్తారు. ఆస్తి కొనుగోలు చేసినా, విక్రయించినా... డాక్యుమెంట్ రైటర్ లేనిదే ఫైలు ముందుకు కదలని పరిస్థితి. ప్రభుత్వానికి చలానా రూపంలో అందే మొత్తం కంటే డాక్యుమెంట్ రైటర్లు వసూలు చేసేదే ఎక్కువగా ఉన్నట్లు తెలుస్తోంది.



హిందూపురం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం ఆవరణలో క్రయవిక్రయదారులు

డాక్యుమెంట్ రైటర్లదే రాజ్యం
ప్రభుత్వానికి రిజిస్ట్రేషన్ శాఖనే ప్రధాన ఆదాయ వనరు. అందువల్లే ప్రభుత్వం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల పని వేళల్లోనూ కాస్త వెసులుబాటు కల్పించింది. ఆన్‌లైన్ ద్వారా చలానా తీసి ప్రజలు నేరుగా రిజిస్ట్రేషన్ చేసుకునే అవకాశం కల్పించింది. కానీ జిల్లాలో ఎక్కడా ఈ విధానం అమలు కావడం లేదు. ప్రజలు నేరుగా అన్ని డాక్యుమెంట్లు సమర్పించి ఆన్‌లైన్‌లో చలానా తీసినా ఆస్తి రిజిస్ట్రేషన్ పూర్తి కాదు. ఎందుకంటే కార్యాలయంలో తిష్టవేసిన డాక్యుమెంట్ రైటర్లు ఆయా డాక్యుమెంట్లకు అధికారులతో కొర్రీలు పెట్టిస్తున్నారు. నేరుగా డాక్యుమెంట్ రైటర్లను కలిస్తే మాత్రం కేవలం సంతకం చేస్తే చాలు రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తవుతుంది. ఇందుకోసం చలానాకు అదనంగా భారీగా వసూళ్లు చేస్తారు. ఇందులో అధికారుల వాటా కూడా ఉంటుందని తెలుస్తోంది.

లెక్కగట్టి రూకలిస్తారు
ఆస్తి రిజిస్ట్రేషన్ చేసే సమయంలో ప్రభుత్వానికి చెల్లించే రుసుంతో పాటు సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయానికి ఇవ్వాల్సిన మొత్తం, డాక్యుమెంట్ రైటర్ వాటా.. కలిపి క్రయ విక్రయ దారులనుంచి వసూలు చేస్తున్నారు. డాక్యుమెంట్ రైటర్ల వ్యవస్థ పోయినా... ఇంకా వారి హవానే కార్యాలయాల్లో సాగుతోంది. మొత్తం కార్యాలయాల్లో వారే అన్నీ చక్కబెడుతూ.. సాయంత్రానికి ఎన్ని డాక్యుమెంట్లు రిజిస్టరయ్యాయో లెక్కగట్టి ఎవరి వాటా వారికి పంచుతున్నట్లు తెలుస్తోంది.



హిందూపురం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం వద్ద డాక్యుమెంట్ రైటర్ల సందడి

హిందూపురంలోని లక్ష్మీపురంలో 1,500 చదరపు అడుగుల స్థలం విలువ బహిరంగ మార్కెట్‌లో రూ.30 లక్షలు. ప్రభుత్వం నిర్ణయించిన విలువ ప్రస్తుతం రూ.14.85 లక్షలు. ఆ స్థలాన్ని రిజిస్ట్రేషన్ చేయాలంటే ప్రభుత్వం నిర్ణయించిన విలువ మేరకు 7.5 శాతం చలానా తీయాల్సి ఉంటుంది. ఆ తర్వాత ఆఫీసు ఫీజు, రైటర్ ఫీజు అదనం. వ్యక్తులను బట్టి, ప్రాంతాన్ని బట్టి ఇళ్లు, కమర్షియల్ సైట్లకు ఈ మొత్తం మారుతుంటుంది. ఎంతలేదన్నా ఒక్కో డాక్యుమెంట్‌కు చలానా కాకుండా అదనంగా కనీసంగా రూ.5 వేలపైనే డాక్యుమెంట్ రైటర్లకు ముట్టజెప్పాల్సి వస్తోందని జనం వాపోతున్నారు.

క్లుప్తంగా

పల్లెలను పరిశుభ్రంగా ఉంచుదాం



తూముకుంటలో సిబ్బందితో మాట్లాడుతున్న జిల్లా పంచాయతీ అధికారి

హిందూపురం అర్బన్: ప్రతి గ్రామంలో తడి, పొడి చెత్త సేకరించి సంపద కేంద్రాలకు తరలించి పల్లెలను పరిశుభ్రంగా ఉంచాలని జిల్లా పంచాయతీ అధికారి సమత పేర్కొన్నారు. శనివారం ఆమె హిందూపురం మండలం తూముకుంట, సంతేబిదనూరు పంచాయతీల్లో పర్యటించి చెత్త తొలగింపు.. సంపద కేంద్రాలకు తరలించే ప్రక్రియను తనిఖీ చేశారు. ప్రతి గ్రామంలో ఓ ప్రణాళిక పరంగా ఉదయం 10 గంటలలోపు చెత్త తొలగించాలని సూచించారు. నేరుగా కూలీలతో, స్వీపర్లతో మాట్లాడి చెత్త సేకరణలో ఎదురవుతున్న సమస్యలు అడిగి తెలుసుకొన్నారు. ఆమె వెంట తూముకుంట, కిరికెర పంచాయతీ కార్యదర్శులు ఎస్. కెంచరాయప్ప, ఇబ్రహీమ్, సర్పంచ్‌లు రత్నమ్మ, లలిత ఉన్నారు.

ముగిసిన శనీశ్వరాలయ ఉత్సవాలు



ఊయలలో జ్యేష్ఠాదేవి సమేత శనీశ్వరస్వామి

పావగడ: స్థానిక శనీశ్వరాలయంలో 12 రోజులుగా నిర్వహిస్తున్న శనీశ్వరస్వామి జాతర ఉత్సవాలు శనివారం ముగిశాయి. చివరి రోజు శనీశ్వరస్వామి, జ్యేష్ఠాదేవిల ఉయ్యాలోత్సం, శయనోత్సవం వైభవంగా జరిగాయి. కార్యక్రమంలో ఆలయ పదాధికారులు, భక్తులు పాల్గొన్నారు.

మల్బరీ.. లాభాలే మరి

- ప్రతి నెలా చేతికొచ్చే పంట ఇదే
- ఆశాజనకంగా పట్టుగూళ్ల ధరలు
- పెట్టుబడి తక్కువ.. రాబడి ఎక్కువ



ఈ ఫొటోలో కనిపిస్తున్న రైతు పేరు జోసెఫ్ డామ్‌నిక్. ఈయన సివిల్ కాంట్రాక్టర్‌గా ఉంటూ అమడగూరు మండలం మలకవారిపల్లి తండా వద్ద 5 ఏళ్లుగా పట్టు పురుగుల పెంపకం చేపడుతున్నారు. ఇటీవల ఈయనొక్కరే 150 పట్టుగుడ్లతో 168 కేజీల దిగుబడిని సాధించి కదిరి మార్కెట్‌లో కిలో రూ.725 తో విక్రయించారు. మందులకు, చివర్లో ఆరుగురు కూలీలకు, దున్నడానికి రూ.16 వేలు ఖర్చు చేశారు. ఈయన ఏడాదికి కచ్చితంగా 10 పంటలు పండిస్తున్నారు. మల్బరీ ద్వారా ఏడాదికి రూ.15 లక్షల నుంచి రూ. 17 లక్షల దాకా ఆదాయం వస్తుందంటున్నారు. వ్యవసాయంలో 21 రోజుల్లో ఒక మనిషి రూ.లక్ష ఆదాయాన్ని గడించడం ఒక్క మల్బరీతోనే సాధ్యమంటున్నారు. అతి తక్కువ ఖర్చులు, రోజులో తక్కువ సమయం కేటాయింపుతో ఇంత ఆదాయం ఎక్కడా లేదంటాడు.



ఈ రైతు పేరు అరవీటి రామకృష్ణారెడ్డి, ఎగువ తూపల్లి, ఎన్‌పీ కుంట మండలం. ఈయన పదిహేనేళ్లుగా పట్టు పురుగులు పెంచుతున్నాడు. 4 రోజుల క్రితం 160 గుడ్లతో 160 కేజీల దిగుబడి సాధించారు. కదిరి మార్కెట్‌లో కిలో రూ.735 తో విక్రయించాడు. పంట మొత్తానికి పురుగుల కొనడంతో పాటుగా, దున్నడానికి, మందులకు, మార్కెటింగ్ ఖర్చులకు రూ.30 వేలు వెచ్చించాడు. ఖర్చులు పోగా రూ.90 వేల ఆదాయం వచ్చింది. ఇంతకంటే ఆదాయం ఏ పంటలోనూ రాదని రామకృష్ణారెడ్డి చెబుతున్నారు.



ఎన్‌పీకుంటలో పట్టుపురుగుల పెంపకాన్ని చూపుతున్న రైతు

అమడగూరు: జిల్లాలో రైతులకు మల్బరీ సాగు సిరులు కురిపిస్తోంది. మార్కెట్లో పట్టుగూళ్లకు ఆశాజనకంగా ధరలు లభిస్తున్నాయి. రైతులు ఆర్థికంగా నిలదొక్కుకోవాలంటే మల్బరీ సాగు.. పట్టుగూళ్ల పెంపకాన్ని అధికారులు సూచిస్తున్నారు. గతంలో పట్టు గూళ్ల ధరలు అంతంత మాత్రంగానే ఉండటం, తగిన సౌకర్యాలు లేకపోవడం, పంటపై సరైన అవగాహన ఉండకపోవడంతో రైతులు ముందుకు వచ్చేవారు కాదు. ప్రస్తుత కాలానుగుణంగా పట్టు శాస్త్రవేత్తలు అధునాతన పద్ధతులలో, ఖర్చులు తక్కువగా, దిగుబడులు ఎక్కువగా వచ్చే విధంగా నాణ్యమైన పట్టుగుడ్లను తయారు చేస్తున్నారు. అంతేకాక పట్టుశాఖ అధికారులు రైతులకు ప్రోత్సాహకాలు ఇస్తుండటం, పంటలో మెలకువలు తెలియజేస్తుండటంతో చాలామంది పట్టు పురుగుల పెంపకానికి ముందుకు వస్తున్నారు. ఈ పట్టు పురుగుల పెంపకంతో భార్యాభర్తలు ఇద్దరే నెలకు రూ.లక్ష రూపాయల దాకా ఆదాయాన్ని గడించవచ్చని అధికారులు పక్కాగా చెబుతున్నారు. అంతేకాక పట్టుగూళ్లను విక్రయించడానికి జిల్లాలో మూడు విక్రయ కేంద్రాల (హిందూపురం, ధర్మవరం, కదిరి)ను ఏర్పాటు చేయడంతో పట్టు రైతులకు మరింత అనుకూలంగా మారింది.

జిల్లాలో పట్టు రైతులు **24,000**

జిల్లాలో మల్బరీ సాగు విస్తీర్ణం **35,000 ఎకరాలు**

జిల్లాలో పట్టుగూళ్ల విక్రయకేంద్రాలు **3**

జిల్లాలో పట్టుగుడ్లు, పురుగుల కొనుగోలు కేంద్రాలు **15-20**

పట్టుగూళ్ల విక్రయ కేంద్రాల్లో శనివారం పలికిన ధరలు

విక్రయకేంద్రం	కనిష్ఠం	గరిష్ఠం
హిందూపురం	రూ.512	రూ.773
ధర్మవరం	రూ.733	రూ.733
కదిరి	వేలం జరగలేదు	

పట్టు పురుగుల పెంపకం నాడు.. నేడు

వివరాలు	10 ఏళ్ల కిందట	ప్రస్తుతం
ఎకరా పొలంతో	150-200 పట్టుగుడ్లు	250-300 గుడ్లు
దిగుబడి	100 గుడ్లకు 50-60 కేజీలు	90-100 కేజీలు
పట్టుగూళ్ల కేజీ ధర	రూ 150-200	రూ 600-800
పురుగులకు మేతలు	4 - 5	కేవలం 2
పురుగుల మేపుకాలం	28 - 30 రోజులు	18 - 20 రోజులు
ఆదాయం	రూ.9 - 13 వేలు	రూ 90 - 1.20 లక్షలు
ఏడాదికి పంటలు	4	6
ఏడాది ఆదాయం	రూ.60 - 80 వేలు	రూ.4.50 - 6.50 లక్షలు
ఏడాది ఖర్చులు	రూ 10-15 వేలు	రూ.60 - 90 వేలు

పట్టు పురుగుల పెంపకం ఉత్తమం



మేము 15 ఏళ్లుగా పట్టు పురుగులను మేపుతున్నాం. మూడు ఎకరాల్లో మల్బరీ తోట ఉంది. ఏ పంట పెట్టినా తెగులు, రోగాలు వస్తున్నాయి. మందుల వినియోగంతో పాటుగా కూలి ఖర్చులు ఎక్కువగా ఉంటున్నాయి. పట్టుపురుగుల పెంపకం అయితే నేను, నా భర్త ఇద్దరే పంటంతా చూసుకుంటాం. రైతులు పట్టు పురుగుల పెంపకానికి అలవాటు పడితే మంచి ఆదాయాన్ని పొందవచ్చు.
–నీరజ, సానేవారిపల్లి, అమడగూరు మండలం

పట్టు రైతులకు ప్రోత్సాహకాలు



పట్టు రైతులకు అధికంగా ప్రోత్సాహకాలు ఇస్తున్నాం. మొలకల దగ్గర నుంచి షెడ్ల నిర్మాణాలకు, పెంపకం పరికరాలు, వ్యవసాయ పరికరాలకు కూడా అధిక సబ్సిడీతో ఇస్తున్నాం. పంట పండిస్తే పట్టు గుళ్లకు కూడా సబ్సిడీ ధర ఇస్తున్నాం. ప్రతి మండలంలోనూ పట్టు పురుగుల పెంపకంపై రైతులకు అవగాహన కల్పిస్తున్నాం. పట్టు పురుగుల పెంపకానికి రైతులంతా ముందుకు రావాలి. మల్బరీ ద్వారా వచ్చే ఆదాయం మరెందులోనూ లేదు.
– పద్మమ్మ, జేడీ, పట్టుశాఖ



పట్టు పురుగుల పెంపకం

అంతర్ జిల్లా దొంగ అరెస్ట్

రాప్తాడు: అంతర్ జిల్లా దొంగను రాప్తాడు పోలీసులు అరెస్ట్ చేశారు. అతని నుంచి 12 తులాల బంగారు, బంగారు అమ్మి కొన్న కారు, బుల్లెట్, స్కూటీని స్వాధీనం చేసుకున్నారు. ఇందుకు సంబంధించిన వివరాలను సీఐ శ్రీహర్ష శనివారం పోలీస్ స్టేషన్‌లో మీడియాకు వెల్లడించారు. రాప్తాడులో వాహనాలు తనిఖీ చేస్తుండగా వైఎస్సార్ జిల్లా దువ్వూరు మండలం జిల్లాల గ్రామానికి చెందిన మహమ్మద్ రఫీపై అనుమానం వచ్చి పోలీసులు తమదైన శైలిలో విచారణ చేయడంతో పలు చోరీలు వెలుగుచూశాయి. అనంతరం అతడిని అరెస్ట్ చేశారు. అనంతపురం, నంద్యాల, కర్నూలు, వైఎస్సార్ జిల్లాల్లోని పలు ఇళ్లలో 47 తులాల బంగారు నగలను చోరీ చేసి, బెంగళూరులోని ఓ ప్రైవేట్ గోల్డ్ కంపెనీలో 35 తులాలను విక్రయించాడు. ప్రస్తుతం రఫీ వద్ద ఉన్న 12 తులాలతో పాటు, మిగిలిన 35 తులాల బంగారు నగలు అమ్మి కొనుగోలు చేసిన మారుతి షిఫ్ట్ డిజైర్ కారు, రాయల్ ఎన్‌ఫీల్డ్ బుల్లెట్, హోండా స్కూటీ సీజ్ చేసి రిమాండ్‌కు తరలించారు. నిందితుని పేరు మీద ఇప్పటికే వైఎస్సార్, కర్నూలు, నంద్యాల జిల్లాల్లోని వివిధ పోలీస్‌స్టేషన్లల్లో 16 చోరీ కేసులు ఉన్నాయి. ఇతని వద్ద నుంచి బంగారు నగలు కొనుగోలు చేసిన అట్టికా గోల్డ్ కంపెనీకి నోటీసులు పంపామని సీఐ తెలిపారు. అంతర్‌జిల్లా దొంగను అరెస్టు చేసిన సీఐ శ్రీహర్షతో పాటు సిబ్బందిని ఎస్పీ జగదీష్, డీఎస్పీ వెంకటేశులు అభినందించారు.

సీబీఆర్‌లోకి 17.10 లక్షల చేప పిల్లలు



చేప పిల్లలను వదులుతున్న దృశ్యం

తాడిమర్రి: మండల సరిహద్దులోని చిత్రావతి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్(సీబీఆర్)లో శనివారం మత్స్యశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ చంద్రశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో 17.10 లక్షల చేప పిల్లను వదిలారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మత్స్యకారుల సంక్షేమం, అభివృద్ధికి ప్రభుత్వం విశేష కృషి చేస్తోందన్నారు. అందులో భాగంగానే నాణ్యమైన మత్స్య సంపదను సీబీఆర్‌లోకి విడుదల చేసినట్లు వివరించారు. కార్యక్రమంలో బీజేపీ మండల కన్వీనర్ దేవర రామ్మోహన్, బీజేపీ నాయకులు చింతల వన్నూర్ రెడ్డి, ఆనంద్, గంగయ్య, టీడీపీ నాయకులు వెంకటరమణ, వెంకటవరద తదితరులు పాల్గొన్నారు.

వ్యాక్సినేషన్‌లో జాగ్రత్తలు పాటించాలి

సోమందేపల్లి: వ్యాధినిరోధక టీకాలు వేసే క్రమంలో జాగ్రత్తలు పాటించాలని జిల్లా వ్యాధి నిరోధక టీకాల అధికారి శ్రీనివాస్‌రెడ్డి సూచించారు. శనివారం రంగేపల్లిలో పర్యటించిన ఆయన టీకాల నిల్వకు సంబంధించి ఐస్ బాక్స్‌లు భద్రంగా ఉంచాలని వైద్య సిబ్బందిని ఆదేశించారు. చిన్నారులు, గర్భిణులకు అందిస్తున్న వ్యాక్సిన్ రిజిస్టర్లను పరిశీలించారు. ఏఎన్‌ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

కందుల కొనుగోళ్లు వేగవంతం చేయండి



రొద్దంలో కందుల కొనుగోలు కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న వైవీ సుబ్బారావు

రొద్దం: కందుల కొనుగోళ్లు వేగవంతం చేయాలని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి వైవీ సుబ్బారావు మార్క్‌ఫెడ్ సిబ్బందిని ఆదేశించారు. శనివారం ఆయన మండల పరిధిలోని తురకలాపట్నం, రొద్దంలో మార్క్‌ఫెడ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కందుల కొనుగోలు కేంద్రాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రైతులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. కంది పండించిన ప్రతి రైతు నుంచి కొనుగోలు చేస్తామన్నారు. కార్యక్రమంలో పెనుకొండ సహాయ వ్యవసాయ సంచాలకులు స్వయంప్రభ, మార్క్‌ఫెడ్ డీఎం గీత, మండల వ్యవసాయ అధికారిణి నివేదిత తదితరులు పాల్గొన్నారు.

శ్రీరూపికకు జాతీయ గుర్తింపు



జాతీయ స్థాయి అవార్డు పొందిన విద్యార్థిని శ్రీరూపిక

తాడిమర్రి: మండలంలోని శివంపల్లి గ్రామానికి చెందిన శ్రీరూపికకు జాతీయ స్థాయిలో గుర్తింపు దక్కింది. విప్రో సంస్థ దేశవ్యాప్తంగా నిర్వహించిన 'విప్రో ఎర్తియన్ 24' పోటీలో తన సహచర విద్యార్థినులతో కలిసి శ్రీరూపిక తొలిస్థానం దక్కించుకుంది. గ్రామానికి చెందిన జడపూల శంకర్‌రెడ్డి, లక్ష్మీ దంపతుల కుమార్తె శ్రీరూపిక అన్నమయ్య జిల్లా కలికిరి మహాత్మా జ్యోతిబాపూలే బీసీ గురుకుల బాలికల పాఠశాలలో తొమ్మిదో తరగతి చదువుతోంది. గత ఏడాది విప్రో ఫౌండేషన్ 'విప్రో ఎర్తియన్ 24' పేరుతో 'నీరు, జీవవైవిధ్యం, వ్యర్థ పదార్థాలు' అన్న అంశంపై దేశవ్యాప్తంగా ప్రాజెక్టులు ఆహ్వానించింది. ఈ పోటీలో శ్రీరూపిక తన బృందంతో కలిసి పాల్గొంది. దేశవ్యాప్తంగా 1,550 ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలకు చెందిన విద్యార్థులు ప్రాజెక్టులు రూపొందించగా, కలికిరి బీసీ గురుకుల పాఠశాల తరఫున శ్రీరూపిక బృందం రూపొందించిన ప్రాజెక్టుకు జాతీయ స్థాయిలో మొదటి స్థానం దక్కింది. దీంతో శనివారం బెంగళూరులో జరిగిన కార్యక్రమంలో విప్రో ఫౌండేషన్ ప్రతినిధి పీఎస్ నారాయణ్ శ్రీరూపికతో పాటు మిగతా విద్యార్థినులకు ప్రశంసాపత్రంతో పాటు అవార్డును ప్రధానం చేశారు.

వీరభద్రస్వామి రథానికి పూజలు



ఊరేగింపు స్థానంలో ఉంచిన వీరభద్రుని రథం

లేపాక్షి: శివరాత్రి పర్వదినం సందర్భంగా లేపాక్షి వీరభద్రస్వామి రథోత్సవం కోసం సిద్ధం చేసిన రథానికి శనివారం ఉదయం ఆలయ కమిటీ ఛైర్మన్ కరణం రమానందన్, గ్రామ సర్పంచ్ ఆదినారాయణ, గ్రామ పెద్దలు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం రథాన్ని బస్టాండు ఆవరణకు తీసుకువచ్చారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ ఛైర్మన్ కరణం రమానందన్ మాట్లాడుతూ... ఈ నెల 25వ తేదీ నుంచి మార్చి 1వ తేదీ వరకు లేపాక్షిలో మహాశివరాత్రి ఉత్సవాలు వైభవంగా నిర్వహిస్తున్నామన్నారు. రథోత్సవానికి ఉమ్మడి జిల్లా నుంచే కాకుండా కర్ణాటక రాష్ట్రం నుంచి కూడా భక్తులు భారీగా తరలివచ్చే అవకాశం ఉందని, ఈ మేరకు ఏర్పాట్లు చేశామన్నారు. కార్యక్రమంలో రథోత్సవం నిర్వహణ సభ్యులు పాల్గొన్నారు.

చెట్టుపై నుంచి పడి యువకుడి మృతి

లేపాక్షి: టెంకాయలు కోసేందుకు చెట్టు ఎక్కిన యువకుడు ప్రమాదవశాత్తు పట్టు తప్పి కిందపడటంతో మృతి చెందాడు. వివరాలిలా ఉన్నాయి. కర్ణాటక రాష్ట్రం బొమ్మసముద్రం గ్రామానికి చెందిన నవీన్ (23) లేపాక్షి మండలం కంచిసముద్రంలో కొంత కాలంగా నివాసం ఉంటున్నాడు. శనివారం సాయంత్రం టెంకాయల కోసం చెట్టు ఎక్కాడు. టెంకాయలు కోస్తుండగా ప్రమాదవశాత్తు చెట్టుపై నుంచి కిందపడటంతో తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతి చెందాడు. ఎస్ఐ నరేంద్ర సిబ్బందితో సంఘటన స్థలాన్ని పరిశీలించి వివరాలు ఆరా తీశారు. కేసు నమోదు చేసి, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

చోరీ కేసు ఛేదన

- అంతర్రాష్ట్ర దొంగ అరెస్ట్.. రిమాండ్
- 35 తులాల బంగారం స్వాధీనం



వివరాలు వెల్లడిస్తున్న సీఐ రాఘవన్

పెనుకొండ: ఇటీవల పెనుకొండలో జరిగిన చోరీ కేసును పోలీసులు ఛేదించారు. నిందితుడిని అరెస్టు చేసి.. రిమాండ్‌కు పంపించారు. అతని వద్ద నుంచి బంగారు రికవరీ చేశారు. నిందితుడు అంతర్రాష్ట్ర దొంగగా గుర్తించారు. ఇందుకు సంబంధించిన వివరాలను సీఐ రాఘవన్ శనివారం మీడియాకు వెల్లడించారు. అనంతపురంలోని గుల్జార్ పేటకు చెందిన సోహేల్‌ఖాన్ కొన్నేళ్ళ క్రితం బెంగళూరుకు వెళ్లి స్థిరపడ్డాడు. చోరీలకు అలవాటుపడ్డ సోహేల్‌ఖాన్ కర్ణాటక, ఏపీ, తెలంగాణల్లో పలు చోరీలు చేశాడు. ఈ క్రమంలో జనవరి 20న పెనుకొండలోని నారాయణమ్మ కాలనీ సమీపాన పట్టపగలే హెచ్ఎం నాగార్జున ఇంట్లో చొరబడి బీరువా పగులగొట్టి 47.2 తులాల బంగారం, రూ.లక్ష నగదు అపహరించుకుపోయాడు. బాధితుల ఫిర్యాదు మేరకు స్థానిక పోలీసుస్టేషన్‌లో కేసు నమోదైంది. ఎస్పీ రత్న ఆదేశాలతో డీఎస్పీ వెంకటేశ్వర్లు ప్రత్యేక బృందాలను రంగంలోకి దించారు. ఎస్ఐ వెంకటేశ్వర్లు, కియా స్టేషన్ ఎస్ఐ రాజేష్, సీసీఎస్ సీఐ శివాంజనేయులు తదితర సిబ్బంది పలు ప్రాంతాల్లో గాలింపు చేపట్టారు. సీసీ టీవీ ఫుటేజీ, ఇతర సమాచారం మేరకు నిందితుడిని గుర్తించారు. అతడు కర్ణాటక రాష్ట్రం తుమకూరులో ఉన్నట్లు సమాచారం అందడంతో ఈ నెల 13వ తేదీనే అరెస్ట్ చేశారు. అయితే కేసు దర్యాప్తులో భాగంగా న్యాయమూర్తి ద్వారా ఈ నెల 19న నిందితుడిని కస్టడీకి తీసుకుని విచారణ చేయగా విస్తుపోయే విషయాలు వెలుగు చూశాయి. నిందితుడు దొంగిలించిన బంగారును తన ఇంట్లో బంగారు ఆభరణాలు కరిగించే పరికరాలు వినియోగించి బంగారు బిస్కెట్లుగా మార్చి హైదరాబాద్‌లో అమ్మేశాడు. దీంతో షాపునకు వెళ్లి నిందితుడు విక్రయించిన 35 తులాల బంగారు బిస్కెట్లను స్వాధీనం చేసుకున్నారు. ఇందులో పెనుకొండ చోరీ కేసుకు సంబంధించి 25 తులాలు, కుప్పంలో జరిగిన దోపిడీకి సంబంధించి 10 తులాలు ఉందని సీఐ పేర్కొన్నారు. దొంగతనానికి ఉపయోగించిన పల్సర్ ద్విచక్రవాహనం, కీప్యాడ్ మొబైల్, బంగారు ఆభరణాలను కరిగించడానికి ఉపయోగించే పరికరాలను స్వాధీనం చేసుకున్నారు. కేసు విచారణ గడువు ముగియడంతో నిందితుడిని కోర్టుకు హాజరుపరచి.. మేజిస్ట్రేట్ ఆదేశాల మేరకు రిమాండ్‌కు పంపించారు. అంతర్రాష్ట్ర దొంగను అరెస్టు చేయడంలో కీలకంగా వ్యవహరించిన ఎస్ఐలతో పాటు సిబ్బంది ఆదినారాయణ, నాగరాజు, సుధాకర్, దస్తగిరి, ఆది,

'దిశ'కు దిక్కు లేదాయె!

- కూటమి ప్రభుత్వం వచ్చాక కేవలం ఒకసారి నిర్వహణ
- ఎంపీలు, కలెక్టర్లకు పట్టని వైనం



అనంతపురం సిటీ: కూటమి ప్రభుత్వం ఏర్పాటయ్యాక జిల్లా సమన్వయ, అభివృద్ధి కమిటీ(దిశ) సమావేశాల నిర్వహణ అస్తవ్యస్తంగా మారింది. దిశ కమిటీకి ఆయా పార్లమెంట్ సభ్యుడు (ఎంపీ) ఛైర్మన్‌గా వ్యవహరిస్తారు. కలెక్టర్ మెంబర్ సెక్రటరీగా ఉంటారు. ఎంపీ అధ్యక్షతన ప్రతి మూడు నెలలకోసారి 'దిశ' సమావేశాలు జరగాలని చట్టం చెబుతున్నా రెండు జిల్లాల్లోనూ అతీగతీ లేకుండాపోయింది. కూటమి ప్రభుత్వం ఏర్పాటయ్యాక అనంతపురం జిల్లాకు సంబంధించి గత ఏడాది అక్టోబర్ 29న 'దిశ' సమావేశం ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ అధ్యక్షతన నిర్వహించారు. శ్రీసత్యసాయి జిల్లాకు సంబంధించి హిందూపురం ఎంపీ బీకే పార్థసారథి అధ్యక్షతన డిసెంబర్ 31న సమావేశం జరిగింది. ఆ తరువాత ఇప్పటి వరకు సమావేశాలు నిర్వహించిన పాపాన పోలేదు.

కొరవడిన సమన్వయం...

ఎంపీలు, కలెక్టర్లు కూర్చొని మాట్లాడాక సమావేశం ఎప్పుడు నిర్వహించేది ప్రకటించాల్సి ఉంది. ఆ తరువాత ఉమ్మడి జిల్లా పరిషత్ అధికారులు అజెండా రూపొందించి అన్ని శాఖల అధికారులతో పాటు సభ్యులకు తెలియజేస్తారు. ఇంతటి ప్రాధాన్యం కలిగిన సమావేశాల నిర్వహణను అటు కలెక్టర్లు, ఇటు ఎంపీలు ఇద్దరూ గాలికొదిలేశారన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. కలెక్టర్లు, ఎంపీల మధ్య సమన్వయం కొరవడటం వల్లే నిర్వహించడం లేదని తెలుస్తోంది. జెడ్పీ అధికారులు మాత్రం పార్లమెంట్, శాసనసభ సమావేశాల కారణంగా సమావేశాల నిర్వహణలో జాప్యం జరుగుతోందని చెప్పుకొంటూ వస్తున్నారు. ఎంపీలు, కలెక్టర్ల అభిప్రాయాల కోసం నోట్ ఫైల్ సిద్ధం చేసి కాళ్లరిగేలా తిరుగుతున్నా తమకు ఎప్పుడు వీలవుతుందో చెప్పడానికి కూడా వారు ఆసక్తి చూపడం లేదని తెలుస్తోంది.

సమస్యల తాండవం..

కీలకమైన జిల్లా సమన్వయ, అభివృద్ధి కమిటీ సమావేశాలు జరగకపోవడంతో సమస్యలు విలయతాండవం చేస్తున్నాయి. అటు శ్రీసత్యసాయి, ఇటు అనంతపురం జిల్లాలో ప్రజలను ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి. ముఖ్యంగా వేసవి వచ్చేస్తోంది. గ్రామాల్లో తాగునీటి సమస్య అప్పుడే చుక్కలు చూపిస్తోంది. మరోవైపు పంట ఉత్పత్తులకు గిటుబాటు ధరల్లేక రైతులు అల్లాడిపోతున్నారు. విద్యుత్ కోతలతో విసుగెత్తిపోతున్నారు. ఇలా అనేక సమస్యలు రాజ్యమేలుతున్నాయి. వాటిపై సమగ్రంగా చర్చించి, పరిష్కారానికి చొరవ చూపాల్సిన ఎంపీలు, కలెక్టర్లు ఎవరి బిజీలో వారు ఉండిపోతున్నారు. ఇప్పటికైనా రెండు జిల్లాల ఎంపీలు, కలెక్టర్లు 'దిశ' కమిటీ సమావేశాల నిర్వహణపై దృష్టి సారించి క్రమం తప్పకుండా నిర్వహించేందుకు చొరవ చూపాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

గురుకులాల్లో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

అనంతపురం ఎడ్యుకేషన్: ఉమ్మడి జిల్లాలోని అంబేడ్కర్ సాంఘిక సంక్షేమ గురుకులాల్లో 2025-26 విద్యా సంవత్సరంలో 5వ తరగతి, ఇంటర్ ప్రథమ సంవత్సరం ప్రవేశాలకు అర్హులైన విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని గురుకుల పాఠశాలల ఉమ్మడి జిల్లా సమన్వయకర్త కె.జయలక్ష్మీ తెలిపారు. ఈ మేరకు శనివారం ఓ ప్రకటన విడుదల చేశారు. బీఆర్ఏజీసెట్-25 ప్రవేశ పరీక్ష ద్వారా (ఇంగ్లిష్ మీడియం) ఎంపిక చేస్తామని వెల్లడించారు. మార్చి 6లోగా https:// apbragcet. apcfss. in వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. 5వ తరగతి ప్రవేశ పరీక్ష ఏప్రిల్ 6వ తేదీన ఉదయం 10 నుంచి 12 గంటల వరకు, ఇంటర్ ప్రవేశ పరీక్ష అదేరోజు మధ్యాహ్నం 2 గంటల నుంచి 4.30 గంటల వరకు ఉంటుందన్నారు.

అనంతపురం జిల్లాలో పాఠశాలల వారీగా సీట్ల వివరాలు

స్కూల్	5వ తరగతి సీట్లు	ఇంటర్ సీట్లు
కురుగుంట (బాలికలు)	80	సీఈసీ 80
తిమ్మాపురం (బాలికలు)	80	ఎంపీసీ,బైపీసీ 80
కణేకల్లు (బాలురు)	80	ఎంపీసీ-బైపీసీ 80
ఉరవకొండ (బాలికలు)	80	ఎంఈసీ,సీఈసీ 80
బి.పప్పూరు (బాలురు)	80	ఎంపీసీ,బైపీసీ 80
కురుగుంట జూనియర్ కళాశాల	--	ఎంపీసీ,బైపీసీ 160
గుత్తి (బాలికలు)	80	ఎంపీసీ,బైపీసీ 80
బ్రహ్మసముద్రం (బాలికలు)	80	సీఈసీ,హెచ్ఈసీ 80
కొర్రపాడు (బాలికలు)	80	------------
మొత్తం	640	720

శ్రీ సత్యసాయి జిల్లాలో పాఠశాలల వారీగా సీట్ల వివరాలు

స్కూల్	5వ తరగతి సీట్లు	ఇంటర్ సీట్లు
కాళసముద్రం (బాలురు)	80	ఎంపీసీ,బైపీసీ 80
మలుగూరు (బాలురు)	80	ఎంపీసీ,బైపీసీ 80
నల్లమాడ (బాలికలు)	80	సీఈసీ-హెచ్ఈసీ 80
అమరాపురం (బాలికలు)	80	ఎంపీసీ,బైపీసీ 80
హిందూపురం (బాలికలు)	80	ఎంపీసీ,బైపీసీ 80
రొళ్ల (బాలురు)	80	-------------
హిందూపురం (బాలురు)	80	-------------
మొత్తం	560	400